

**63 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం**

వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న 63 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డిఐజీ ఉత్తర్వులను జారీ చేశారు. -8లో



**ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి**

రైల్వే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా రైల్వే స్టేషన్‌లో పనులు కొనసాగించాలని గుంతకల్లు డీఆర్‌ఎం ఆదేశించారు. -8లో

గరిష్టం/కనిష్టం
32.9/24.2

**వాతావరణం**

జిల్లాలో గురువారం 24.2 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

### సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామ్ చరణ్



దువ్వూరు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నీలం రామ్‌చరణ్ నియమితులయ్యారు. ఈయన దువ్వూరు సచివాలయం-2లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా రామ్‌చరణ్ తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష -2025 సంబంధించి 6వ తరగతిలో అడ్మిషన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల డిప్యూటీ ఈఓలు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని 6వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలను navodaya.gov.in వెబ్‌సైట్‌లో పొందాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు.

### రేపు హ్యాండ్‌బాల్ అండర్-19 ఎంపికలు

కడప స్పోర్ట్స్: ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర విభాగం ఎంపికలు ఈనెల 10వ తేదీ శనివారం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మణ్ తెలిపారు. అదే విధంగా ఈనెల 12వ తేదీన టి.సుండుపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 9 గంటలకు జూనియర్ బాలికల విభాగం ఎంపికలు ఉంటాయని వివరించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు తీసుకు రావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు సత్యసాయిజిల్లా కదిరిలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

### రక్తహీనతను నివారిద్దాం

కడప రూరల్: రక్తహీనత నివారణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక చిన్నచౌక్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రక్తహీనతను నివారించే కార్యక్రమంలో భాగంగా వీక్లీ ఐరన్ సప్లిమెంట్ (డబ్ల్యూఐఎఫ్ఎస్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు ఐరన్ మాత్రలు ఇస్తున్నామని వివరించారు. ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ రక్తహీనతను నివారించడానికి సకాలంలో రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ఐరన్ మాత్రలను వేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఉష, డాక్టర్ అనూష, డిప్యూటీ డెమో రమణమ్మ, కుమారి, రమణ, నవీన్ పాల్గొన్నారు.

### 'ఓపెన్ స్కూల్'ను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న డీఈఓ, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ తదితరులు

కడప ఎడ్యుకేషన్: అనివార్య కారణాలతో విద్యకు దూరమైన వారి కోసం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారు ప్రవేశ పెట్టిన ఓపెన్ స్కూల్ విద్యను అభ్యాసకులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. గురువారం ఆమె ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డితో కలిసి డీఈఓ కార్యాలయ ఏడీలు, సిబ్బందితో కలిసి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్ పొందాలనుకునే అభ్యాసకులు ఈ నెల 27 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేసు, సూపరింటెండెంట్ బాదుల్లా పాల్గొన్నారు.

# ఖుల్‌జా.. సిమ్ సిమ్

- బీఎస్ఎన్ఎల్ వైపు వినియోగదారుల చూపు
- ప్యాకేజీలను భారీగా పెంచిన ప్రైవేటు సంస్థలు
- జియో, ఎయిర్‌టెల్, వొడా సంస్థల నుంచి 4,978 మంది ఛేంజ్
- 36 రోజుల్లో 10,481 మంది బీఎస్ఎన్ఎల్‌కు మార్పు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఇప్పటికే 290 సిగ్నల్ టవర్లు
- మారుమూల గ్రామాల్లో కూడా సేవలు అందించడమే లక్ష్యం




బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కడప: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పూర్వ వైభవం దిశగా అడుగులేస్తోంది. ప్రైవేటు టెలికాం సంస్థలు భారీ గా రేట్లు పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మళ్లుతున్నారు. ప్రస్తుతానికి బీఎస్ఎన్ఎల్‌కు మించిన సర్వీసు, టారిఫ్ లేదని వినియోగదారులు అటువైపు దృష్టి సారించారు. ప్రైవేటు సంస్థలు మార్కెటింగ్ మాయాజాలంతో వినియోగదారులను ఆసాంతం పెంచుకొని ఆపై సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు సంస్థల దోపిడీ వ్యవహారాన్ని గుర్తించిన వినియోగదారులు ప్రభుత్వ సర్వీసు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఒరవడి ఇలాగే కొనసాగితే బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం వచ్చే రోజు దగ్గర్లోనే ఉందని చెప్పడంలో సందేహం లేదు. కాగా ప్రైవేటు సంస్థలు మార్కెటింగ్ సమయంలో ఆశాజనకమైన ఆఫర్లు పెట్టడం, బాగా అలవాటు పడ్డ తర్వాత భారీగా నెట్‌వర్క్ రేట్లు పెంచడమే దీనికి ప్రధాన కారణమని పలువురు వివరిస్తున్నారు. పోటీ ప్రపంచానికి దీటుగా పరిగెత్తే అవకాశం ఉన్నా, బీఎస్ఎన్ఎల్‌లో ఇంతకాలం నిస్తేజం ఆవహించింది. తాజాగా 4జీ సేవలు విస్తరించడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

**4978** నెల రోజుల వ్యవధిలో బీఎస్ఎన్ఎల్‌కు మారిన ఇతర నెట్‌వర్క్ వినియోగదారులు

**2594** జియో నుంచి మారిన వినియోగదారుల సంఖ్య

**1824** ఎయిర్‌టెల్ నుంచి మారిన వారి సంఖ్య..

**557** వొడాఫోన్ నుంచి మారిన వారి సంఖ్య..

**5863** కొత్త కనెక్షన్లు

**10841** నెల రోజుల వ్యవధిలో బీఎస్ఎన్ఎల్‌కు చేరినవారు




| సంస్థ పేరు | 28రోజులు/ 1.5జీబీ/డే | 28రోజులు/ 2జీబీ/డే | 28రోజులు/ 2.5జీబీ/డే | ఏడాదికి |
| --- | --- | --- | --- | --- |
| జియో | రూ.299 | రూ.349 | రూ.399 | రూ.3599 |
| ఎయిర్‌టెల్ | రూ.299 | రూ.349 | రూ.399 | రూ.3599 |
| వొడా | రూ.299 | రూ.349 (3జీబీ/డే) | - | - |
| బీఎస్ఎన్ఎల్ | రూ.187 | రూ.347 (54రోజులు) | - | రూ.2,399 |



### విస్తారంగా ఫోన్ సిగ్నల్స్

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మొత్తం 290 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయి. కొత్తగా 49 టవర్ల ఏర్పాటుకు ఆ సంస్థ ప్రతిపాదనలు పంపింది. యాజమాన్యం 15 టవర్లు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. ఇప్పటికే మారు మూల గ్రామాలల్లో సైతం బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ అందుబాటులో ఉంది. మరింత విస్తరించే చర్యల్లో భాగంగా టవర్లు ఏర్పాటుకు మొగ్గు చూపుతోంది. సుమారు 1.7లక్షల మంది ఉన్న వినియోగదారులు గణనీయంగా పెరగనున్నా రు. బ్రాడ్‌బాండ్ కనెక్షన్లు విస్తరించాలనే లక్ష్యంతో ఆ సంస్థ వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. ప్రైవేటు సంస్థలతో పోల్చుకుంటే ప్రతినెలా కనీసం రూ.100 తక్కువ రేటుకు నెట్‌వర్క్ సేవలను అందించేలా ప్లాన్‌లుబీఎస్ఎన్ఎల్‌లో ఉన్నాయి. ప్రధానంగా గ్రామీణుల్లో ఆలోచన మొదలై ప్రభుత్వ నెట్‌వర్క్ వైపు మొగ్గు చూపుతున్నారని పలువురు వివరిస్తున్నారు.

### అన్నింటినీ అధిగమిస్తాం



ప్రైవేటు టెలికాం సంస్థలు మొబైల్ రీచార్జీలను విపరీతంగా పెంచాయి. వినియోగదారులపై మోయలేని భారం మోపాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రజలకు అండగా నిలవాలనుకుంది. అందుకే ప్రజలకు భారం కాకుండా ఆకర్శణీయమైన ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చాం. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. అన్నింటిని అధిగమించి మెరుగైన నెట్‌వర్క్‌తో వినియోగదారుడికి సేవలు అందించనున్నాం.

- షేక్ ముజీబ్‌పాషా, జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, కడప

### బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం



ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం రానుంది. జిల్లాలో 4జీ టవర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రైవేటు సంస్థలకు ధీటుగా సేవలు అందించడం హర్షణీయం. ప్రస్తుత ప్రైవేటు టెలికాం సంస్థలు టారిఫ్ రేట్లను భారీగా పెంచడంతో సెల్‌ఫోన్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -అనిల్‌కుమార్, కడప

### తక్కువ ధరకు సేవలు



బీఎస్ఎన్ఎల్ మిగతా ప్రైవేటు నెట్‌వర్క్‌లతోపోలిస్తే అతి తక్కువ టారిఫ్‌తో సేవలు అందిస్తోంది. జియో, ఎయిర్‌టెల్ తోపాటు ఇతర కంపెనీలు టారిఫ్ రేట్లను పెంచడం దారుణం. - నాగరాజు, కడప

### 4జీ సేవలు భేష్



బీఎస్ఎన్ఎల్ సంస్థ అతి త్వరలోనే 4జీ సేవలను తీసుకు రావడం ఎంతో ఆనందదాయకంగా ఉంది. గతంలో ఎంతో నెట్‌వర్క్ కలిగిన బీఎస్ఎన్ఎల్ ప్రైవేటు సంస్థల ధాటికి కుదేలైంది. బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెడుతున్న ఆఫర్లను చూస్తే ప్రజలు దాని పట్ల ఆకర్శితులవుతున్నారు. -ఓబులేశు, కడప

### తక్కువ ప్యాకేజీతో అత్యుత్తమ సేవలు



బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు తీసుకురావడమే కాకుండా అతి తక్కువ ప్యాకేజీతో అత్యుత్తమ సేవలను అందిస్తోంది. ప్రైవేటు నెట్‌వర్క్‌లతోపోలిస్తే బీఎస్ఎన్ఎల్ సేవలు తక్కువ ధరకు లభిస్తున్నాయి. పైగా ప్రజల అభిరుచులకు అనుగుణంగా వివిధ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకు రావడం సంతోషదాయకం. - ఎస్‌వీ శేషయ్య, కడప

# జిల్లాలో ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నికలు

- 2051 స్కూళ్లకుగాను 1999 స్కూళ్లలో ఎన్నికలు
- 52 పాఠశాలల్లో వివిధ కారణాలతో ఆగిన ఎన్నికలు
- 1357 స్కూళ్లలో ఎన్నికలు ఏకగ్రీవం



పెండ్లిమర్రి: పాఠశాలలో ప్రమాణ స్వీకారం చేస్తున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు కొన్ని పాఠశాలల్లో ఏకపక్షంగా అధికార పార్టీకి అనుకూలంగా జరిగినట్లు తెలిసింది. కొన్ని పాఠశాలల్లో కోరం లేకపోవడం తదితర కారణాలతో ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. జిల్లావ్యాప్తంగా 1625 ప్రాథమిక, 126 ప్రాథమికోన్నత, 300 ఉన్నత పాఠశాలలు అన్ని కలిసి 2051 పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు జరగాల్సి ఉండగా.. 1602 ప్రాథమిక పాఠశాలల్లో, 115 ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 282 ఉన్నత పాఠశాలల్లో కలిసి మొత్తం 1999 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 1357 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 52 పాఠశాలల్లో పలు కారణాలతో ఎన్నికలు వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు.

**కడప గాంధీనగర్ స్కూళ్లో..**

కడప గాంధీనగర్ స్కూల్లో వైస్ చైర్మన్ ఎన్నికల విషయంలో రాజకీయ జోక్యం జరిగినట్లు తెలిసింది. ఈ పాఠశాలలో ఎస్సీ ఉమెన్‌ను చైర్మెన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్మెన్‌గా బీసీ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత స్థానిక టీడీపీ నాయకులు వచ్చి హెచ్‌ఎంపైన ఒత్తిడి చేసి ఆ ఎన్నికల ను రద్దు చేయించి తాము సూచించిన అభ్యర్థిని ఎన్నుకున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితే జిల్లాలో చాలా పాఠశాలల్లో జరిగినట్లు ఆరోపణలు వినిపించాయి.

### వాయిదా పడ్డ పాఠశాలల వివరాలు..

బి.కోడూరు మండలంలో ఒక పాఠశాల, బి.మఠంలో రెండు, బద్వేల్‌లో రెండు, సీకేదిన్నె మండలంలో నాలుగు, చక్రాయపేటలో ఒకటి, చాపాడు ఒకటి, గోపవరంలో నాలుగు, కడప మండలంలో 13, కలసపాడులో రెండు, కొండాపురంలో మూడు, మైలవరంలో ఒకటి, సిద్దవటంలో ఆరు , తొండూరులో ఒక పాఠశాల, వీఎన్‌పల్లి మండలంలో రెండు పాఠశాలల్లో ఎన్నికలు జరగలేదు. అలాగే వల్లూరులో ఒకటి, ఒంటిమిట్టలో రెండు, వేములలో ఒక పాఠశాలలో, పోరుమామిళ్లలో రెండు పాఠశాలల్లో, ప్రొద్దుటూరులో రెండు పాఠశాలల్లో, పులివెందలలో ఒక పాఠశాలలో వివిధ కారణాలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

# జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దాం

- కలెక్టర్ శివశంకర్ లోతేటి
- వీసి ద్వారా కలెక్టర్లతో ఆకాంక్ష జిల్లాలపై సమీక్షించిన నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజల ఆకాంక్ష.. జిల్లాల ఆశయాలకు అనుగుణంగా జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆకాంక్ష జిల్లాల ఆశయసాధనలో భాగంగా జిల్లాలో కార్యాచరణ, ప్రగతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచికలెక్టర్ శివశంకర్‌తో పాటు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ 2018లో 'నీతి ఆయోగ్'ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. మన రాష్ట్రంలో వైఎస్‌ఆర్ జిల్లా, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను ఎంపిక చేశారన్నారు. అందులో భాగంగా ఆయా జిల్లాల్లో సామాజిక స్థాయిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఆరు అంశాలకు సంబంధించి కీ పారామీటర్ ఇండికేట్ (కేపీఐ) పాయింట్ల ఆధారంగా ప్రగతిని లెక్కిస్తారన్నారు. అందుకోసం సంబందిత శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. వినూత్నమైన ఆలోచనలకు నిర్మాణ రూపం ఇచ్చేందుకు ప్రతి శాఖ సంసిద్ధం అవ్వాలని కలెక్టర్ అన్నారు. డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, సీపీఓ వెంకట్రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అనురాధ, తదితర అధికారులు హాజరయ్యారు.

**చేతివృత్తిదారుల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి**

గ్రామీణ, మున్సిపాలిటీ పరిధిలో విశ్వకర్మ పథకానికి సంబంధించి దుస్తులు కుట్టే దర్జీలు, తాపీ పని చేసేవారు నమోదు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి వారికి అన్ని విధాల తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. గురువారం పీఎం విశ్వకర్మ యోజన సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ పథకానికి సంబంధించి దరఖాస్తులు పంపారని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### సహనం, సానుకూల దృక్పథంతో బాధ్యతలు నిర్వర్తించాలి

అర్జీదారులు, ఫిర్యాదుదారుల పట్ల సహనంతో, సానుకూల దృక్పథంతో స్పందించగలిగినపుడే అధికారులు ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక హాలులో జేసీ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డిలతో సమావేశమయ్యారు. ఇటీవల అమరావతిలో సీఎం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్ లో సమీక్షించిన అంశాలను కలెక్టర్ వారికి వివరించడంతో పాటు పలు అంశాలపై సూచనలు జారీచేశారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. 'వికసిత్ ఆంధ్రా-2024'లక్ష్య సాధన కోసం జిల్లాలో జిల్లా ప్రణాళికాధికారి ఆధ్వర్యంలో ఆగస్టు 13న వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి జిల్లాలో ప్రతి సోమవారం 'హ్యాండ్ లూమ్ డే'ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



జిల్లాలో గురువారం నాగుల చవితి ఘనంగా జరిగింది. మహిళలు ఉదయాన్నే పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. నాగుల ప్రతిమలకు దారాలు కట్టారు. నాగయ్యా.. కాపాడవయ్యా అంటూ మొక్కుకున్నారు.


# సైన్స్ ఫెయిర్‌కు విశేష స్పందన



సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

మైదుకూరు : శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతి సందర్భంగా గురువారం మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి సైన్స్ నమూనాల ప్రదర్శన (సైన్స్‌ఫెయిర్)ను నిర్వహించగా విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ మాట్లాడుతూ యల్లాప్రగడ సుబ్బారావు ఆదర్శనీయుడని అన్నారు. ఆయన తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని తెలిపారు. విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని, తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని సూచించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు అతి పేద కుటుంబం నంచి వచ్చినప్పటికీ ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్తలతో ప్రముఖుడిగా ఎదిగారని తెలిపారు. తన ఇద్దరు సోదరులు ఉష్ణ మండల స్ప్రూ కారణంగా మరణించడంతో ఆయన వైద్య విద్య పట్ల ప్రేరేపితుడయ్యారన్నారు. టెట్రాసైక్లిన్ లాంటి అనేక ఔషధాలను కనుగొన్న గొప్ప తెలుగు జాతి ముద్దు బిడ్డ అని కొనియాడారు. జిల్లా సైన్స్ అధికారి ఇమ్మాన్యుయేల్, ప్రోగ్రాం ఆర్గనైజర్ మూర్తి వెంకటేశ్వర్లు డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జీవిత విశేషాల గురించి వివరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. వీటిలో మొదటి బహుమతి రూ.2 వేలు నగదును పల్లవోలు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎం.భావజ్ఞ, ద్వితీయ బహుమతి రూ.1500 పులివెందుల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం.గౌరీశంకర్, తృతీయ బహుమతి రూ.1000 మైదుకూరు కేజీబీవీ విద్యార్థిని నిహారిక అందుకున్నారు. స్పెషల్ కన్సోలేషన్ బహుమతి కడప జెడ్పీ హైస్కూల్ బాలుర బ్లైండ్ స్కూల్ విద్యార్థి బి.శర్వానంద్ రెడ్డి అందుకున్నాడు. న్యాయ నిర్ణేతలుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎస్.నవనీశ్వర్‌రెడ్డి వ్యవహరించారు.

### 11న కృష్ణా జలాలు రాక



గండికోట ప్రాజెక్టును పరిశీలించిన సీఈ మల్లికార్జునరెడ్డి

కొండాపురం: ఈ నెల 11న కృష్ణజలాలు గండికోట జలాశయానికి రానున్నట్లు జీఎన్ ఎస్ ఎస్ సీఈ మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. గురువారం జీఎన్ఎస్ఎస్ సీఈ మల్లికార్జునరెడ్డి,ఎస్ఈ శ్రీనివాసులు, క్వాలిటీకంట్రోల్ ఎస్ఈ శారద, గండికోట టర్నల్ ఈఈ రామనాయక్ అధికారులు గండికోట ప్రాజెక్టు వద్ద గేట్లను, టర్నల్ (సొరంగం)ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలల్లో అధిక వర్షాలు కురవడంతో శ్రీశైలం జలాశయంలోకి వరదనీటి ప్రవాహం ఎక్కువగా ఉందన్నారు. అక్కడ నుంచి ఓర్వకల్లు ప్రాజెక్టు.. ఆపై అవుకు రిజర్వాయర్‌కు కృష్ణజలాలు రానున్నాయన్నారు. అనంతరం గండికోట ప్రాజెక్టును పరిశీలించారు. గండికోట పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.4 టీఎంసీలు కనిష్ట స్థాయిలో ఉన్నాయి. డీఈ ఉమ మహేశ్వర్లు, జీఎన్ ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విరిగిన విగ్రహం




మధ్య స్తంభంపై విగ్రహం లేని దృశ్యం

కడప కల్చరల్ : కడప నగరంలోని మాసాపేట సర్కిల్‌లో ఏర్పాటు చేసిన దేవా విగ్రహం ఒకటి గురువారం కూలిపోయింది. నగర సుందరీకరణకు రహదారుల విస్తరణలో భాగంగా కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కూడళ్లు ఇటీవల అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా దేవుని గడప నమూనా ఏర్పాటుచేసి నాలుగు వైపులా 11 దేవతా విగ్రహాలు ఏర్పాటుచేశారు. యువకులు ఆ విగ్రహాలకు పూలమాల వేయాలని అత్యుత్సాహం చూపడంతో స్తంభం పైకి ఎక్కగానే కింద పడిపోయింది. వివాదాలు తలెత్తకముందే విగ్రహాలు పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సంఘాల నాయకులు కోరుతున్నారు.

### పిల్లలపై వివక్ష చూపరాదు

కడప ఎడ్యుకేషన్ : విభిన్న ప్రతిభావంతులైన పిల్లలపై ఎలాంటి వివక్ష చూపరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు 18 సంవత్సరాలు వచ్చే వరకూ ఉచిత విద్య అందించాలన్నారు. వీరికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు, ప్రత్యేక వసతులు కల్పించాలన్నారు. అనంతరం అంధుల పాఠశాల హాస్టల్‌ను పరిశీలించారు. తదనంతరం వైద్య శిబిరం నిర్వహించి పలువురికీ వైద్యపరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో డిజబుల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఏడీ కృష్ణ కిశోర్, డిస్టిక్ ప్రొబేషన్ ఆఫీసర్ చెన్నా రెడ్డి, ఎంఈవో గంగిరెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు ఆఫీసర్ సునీత, వైద్యాధికారి సుమధుర, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి.. చిత్రం గీసింది



కడప నగర సమీపంలోని బుగ్గ వంక ప్రాజెక్టు వద్ద ప్రకృతి అందాలు ఆకట్టుకుంటున్నాయి. సహజ సిద్ధ అందాలకు నెలవైన కొండ ప్రాంతాల నడుమ రమణీయమైన దృశ్యాలు.. కొండను తొలిచినట్లుగా రాళ్లు.. వాటి మధ్య జాలవారుతున్న జల సవ్వళ్లు మైమరపిస్తున్నాయి. ఆదివారం ప్రాజెక్టు సందర్శనకు అధిక సంఖ్యలో తరలివచ్చిన జనం ఈ అందాలను తమ చరవాణీల్లో బంధించారు. అక్కడే దోటీలు వేసి చేపల వేట కొనసాగించారు.

– చింతకొమ్మదిన్నె

## దివ్య పుష్పం.. వికసించింది



అరుదుగా కొన్ని జాతులకు చెందిన పూలు ఏడాదికోసారి మాత్రమే వికసిస్తాయి. ప్రధానంగా పౌర్ణమి తర్వాత వికసించే పుష్పం.. బ్రహ్మకమలం. ఏటా వర్షాకాలంలో వికసించే ఈ పూలను భక్తులు ప్రత్యేకంగా పూజిస్తారు. మండలంలోని కలకడ టౌన్ త్రికూటమి సారథి స్వామి పెరటి తోటలోనూ, యర్రయ్యగారిపల్లెలోని రామక్రిష్ణ ఇంట్లోనూ బ్రహ్మకమలం పుష్పం వికసించింది. స్థానికులు ఆసక్తిగా తిలకించి పూజలు చేశారు.

– కలకడ

## ఊసరవెల్లి కనిపించింది

ఊసర వెల్లులు రక్షణ కోసం తమ రంగు మారుస్తాయని చెబుతారు. వేటాడే జంతువుల నుంచి రక్షణకు తమ ఎరను కలవర పెట్టడానికి ఇలా రంగు మారుస్తాయి. తన శరీరానికి ఫొటోనిక్ క్రిస్టల్ అని పొర ఉంటుంది. ఇది పర్యావరణానికి అనుగుణంగా రంగు మార్చడానికి సహాయ పడుతుంది. ఇలాంటివి అరుదుగా కనిపిస్తుంటాయి. మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డుపై గిలా ఊసరవెల్లి వెళ్తే కనిపించడంతో పలువురు తమ చరవాణుల్లో చిత్రాన్ని బంధించారు.

– మదనపల్లె సిటీ



రోడ్డుపై వెళుతున్న ఊసరవెల్లి

## కొనేందుకు వచ్చి.. చీరలు చోరీ

ప్రొద్దుటూరు క్రైం : దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆరుగురు మహిళలు దుకాణానికి వచ్చి లక్ష రూపాయల విలువైన చీరలు చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. రెండు రోజుల కిందట ఐదుగురు మహిళలు ఇన్నోవా కారులో శ్రీరాంనగర్ వెంకటేశ్వర సిల్క్స్ దుకాణానికి వెళ్లారు. తమకు చీరలు కావాలని అడిగి.. ఫ్యాన్సీ, పట్టు చీరలు చూశారు. ఇంకా చీరలు ఉంటే చూపాలనడంతో పక్క గదిలో ఉన్నాయని దుకాణదారు చెప్పారు. దీంతో మహిళలు ఆ గదిలోకి వెళ్లారు. విలువైన కొన్ని చీరలను తమ లో దుస్తుల్లో దాచుకొని తీసుకెళ్లారు. అనంతరం చూసిన దుకాణ యజమాని.. విలువైన చీరలు కనిపించకపోవడంతో సీసీ ఫుటేజీ పరిశీలించారు. కారులో వచ్చిన మహిళలు దోచుకెళ్లినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులను ఆశ్రయించారు. లక్ష రూపాయల విలువ చేసే చీరలు చోరీకి గురయ్యాయని బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## రెండు ద్విచక్ర వాహనాల చోరీ

ఖాజీపేట: వరస చోరీల పరంపర ఖాజీపేట ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఏటీఎం చోరీ విఫలయత్నం మరువకనే గురువారం రెండు ద్విచక్ర వాహనాల చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు.. బుద్దాయపల్లె సమీపంలోని బీఎంబీ పెట్రోల్ బంక్‌లో పాటిమీద పల్లెకు చెందిన ప్రభాస్ పనిచేస్తున్నారు. తన బైక్‌ను అక్కడే పార్క్ చేశారు. తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో లాక్ ఓపెన్ చేసి బైక్‌ను దొంగలు అపహరించుకువెళ్లారు. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించగా దొంగ బైక్‌ను తీసుకు పోతున్నట్లు గుర్తించారు. ఆ మేరకు ఖాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో మండలం లోని కుమ్మర కొట్టాల సమీపంలోని వేర్ హౌస్ వద్ద యజమాని ఇంట్లో బైక్ పార్క్ చేశారు. ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి పరిశీలిస్తే బైక్ లేకపోవడంతో చోరీ చేసినట్లు గుర్తించారు. ఆమేరకు ఖాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు దారుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



## 63 మంది ఎస్ఐలకు స్థాన చలనం

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా, ఇతర జిల్లాలో పనిచేస్తున్న 63 మంది ఎస్ఐలను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డిఐజీ కోయ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు.

### స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది బదిలీ

జిల్లా వ్యాప్తంగా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న 34 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వారికి కేటాయించిన పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.

| ఎస్ఐ పేరు | ప్రస్తుతం | బదిలీ |
|---|---|---|
| జి. అమర్‌నాథ్‌రెడ్డి | ఎస్.ఎ.కాశినాయన పిఎస్ | కడప వన్‌టౌన్ పీఎస్ |
| కె. ప్రదీప్‌నాయుడు | దిశ పీఎస్ | కడప తాలూకా పీఎస్ |
| డి.తయార్‌హుసేన్ | డీఎస్‌బి, కడప | కడప తాలూకా పీఎస్ |
| కె.బి. మల్లికార్జున | కడప తాలూకా పీఎస్ | వీఆర్, కడప |
| ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి | డీఎస్‌బి, కడప | చిన్నచౌక్ పీఎస్ |
| ఈ.ఏ.సుభాష్‌చంద్రబోస్ | డీఎస్‌బి, కడప | రిమ్స్ పీఎస్ |
| యు.వై.జయరాములు | బి.కోడూరు పీఎస్ | రిమ్స్ పీఎస్ |
| ఎస్‌కె.ఎం.హుసేన్ | టి.సుండుపల్లి(అన్నమయ్య) | కడప టూటౌన్ పీఎస్ |
| ఎం. సిద్ధయ్య | వీఆర్, కడప | కడప టూటౌన్ పీఎస్ |
| జి.మధుసూదన్‌రెడ్డి | కడప వన్‌టౌన్ పీఎస్ | పెండ్లిమర్రి పీఎస్ |
| పి.మంజునాథ్ | ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ | వి.ఎన్.పల్లె పీఎస్ |
| ఎం.ఎస్. సంజీవరాయుడు | కడప టూటౌన్ పీఎస్ | వల్లూరు పీఎస్ |
| బి. శివప్రసాద్ | ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ | ఒంటిమిట్ట పీఎస్ |
| టి.వి.ఎస్. చిరంజీవి | ఎర్రగుంట్ల పీఎస్ | సిద్ధవటం పీఎస్ |
| పి.సి.జయగోపాల్ | వీఆర్, కడప | పిసీఆర్, కడప |
| ఎం.వి అనిల్‌కుమార్ | సింహాద్రిపురం పీఎస్ | పులివెందుల పీఎస్ |
| వి. నారాయణ | రిమ్స్ పీఎస్ | పులివెందుల పీఎస్ |
| ఎం.రంగారావు | ఆర్.కే.వ్యాలీ పీఎస్ | వేంపల్లి పీఎస్ |
| ఈ. తిరుపాల్ నాయక్ | కడప తాలూకా పీఎస్ | వేంపల్లి పీఎస్ |
| పి. తులసీనాగప్రసాద్ | రాజుపాలెం పీఎస్ | సింహాద్రిపురం పీఎస్ |
| బి. పెద్ద ఓబన్న | సిద్ధవటం పీఎస్ | తొండూరు పీఎస్ |
| సి. లక్ష్మీనారాయణ | తొండూరు పీఎస్ | డీఆర్, కడప |
| బి. మధుసూదన్‌రావు | ఒంటిమిట్ట పీఎస్ | లింగాల పీఎస్ |
| ఎం. భాస్కర్‌రెడ్డి | ఎర్రగుంట్ల పీఎస్ | ఆర్.కె వ్యాలీ పీఎస్ |
| పి. ప్రవీణ్‌కుమార్ | వేంపల్లి పీఎస్ | వేముల పీఎస్ |
| బి.వి కృష్ణయ్య | లింగాల పీఎస్ | చక్రాయపేట పీఎస్ |
| ఎస్. శ్రీనివాసులు | దువ్వూరు పీఎస్ | ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ |
| పి. హైమవతి | ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ | వీఆర్, కడప |
| జి. ధనుంజయుడు | వేముల పీఎస్ | ప్రొద్దుటూరు టూటౌన్ పీఎస్ |
| కె. వెంకటరమణ | వల్లూరు పీఎస్ | రాజుపాలెం పీఎస్ |
| పి.యోగేంద్ర | కొండాపురం పీఎస్ | ప్రొద్దుటూరు త్రీటౌన్ పీఎస్ |
| జెడ్. జ్యోతి | ప్రొద్దుటూరు త్రీటౌన్ పీఎస్ | సీసీఎస్ పీఎస్ |
| ఎం. భాస్కర్ | వీఆర్, కడప | ప్రొద్దుటూరు ట్రాఫిక్ పీఎస్ |
| ఎం.డి రఫి | చిన్నచౌక్ పీఎస్ | ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ |
| ఎస్. సుబ్బారావు | వీఆర్, కడప | మైదుకూరుపీఎస్ |
| జె.రవికుమార్ | బద్వేల్ రూరల్ పీఎస్ | బద్వేల్ పీఎస్ |
| ఎస్. వినోద్‌కుమార్ | చక్రాయపేట పీఎస్ | దువ్వూరు పీఎస్ |
| జి. చంద్రశేఖర్ | తాళ్ల ప్రొద్దుటూరు పీఎస్ | బి. మఠం పీఎస్ |
| కె. చిన్నపెద్దయ్య | ఓబులవారిపల్లి (అన్నమయ్య) | చాపాడు పీఎస్ |
| బి. రామకృష్ణ | ప్రొద్దుటూరు టూటౌన్ పిఎస్ | అట్లూరు పీఎస్ |
| కె. చాపలరాజు | అట్లూరు పీఎస్ | బి.కోడూరు పీఎస్ |
| ఆర్.వి. కొండారెడ్డి | చాపాడు పీఎస్ | పోరుమామిళ్ల పీఎస్ |
| కె. చిరంజీవి | ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ | కలసపాడు పీఎస్ |
| పి.హనుమంతు | తలమంచిపట్నం పీఎస్ | ఎస్ఏ కాశినాయన పీఎస్ |
| బి.నాగమురళి | కలసపాడు పీఎస్ | ఎర్రగుంట్ల పీఎస్ |
| ఎం. విష్ణునారాయణ | పులివెందుల పీఎస్ | ఎర్రగుంట్ల పీఎస్ |
| బి. రామకృష్ణ | పెద్దముడియం పీఎస్ | జమ్మలమడుగు పీఎస్ |
| కె. సుబ్బారావు | జమ్మలమడుగు పీఎస్ | పెద్దముడియం పీఎస్ |
| ఏ. విద్యాసాగర్ | బి.మఠం పీఎస్ | కొండాపురం పీఎస్ |
| ఎల్. తిమోతి | వీఆర్, కడప | కలమల్ల పీఎస్ |
| జి. హృషికేశ్వర్‌రెడ్డి | కమలాపురం పీఎస్ | తాళ్ల ప్రొద్దుటూరు పీఎస్ |
| సి. బాలఅంకయ్య | వీఆర్, కడప | డీఎస్‌బి, కడప |
| ఆర్.మురళీమోహన్ | వీఆర్, కడప | డీఎస్‌బి, కడప |
| బి. అరుణ్‌రెడ్డి | వీఆర్, కడప | డీఎస్‌బి, కడప |
| సి. శ్రీనివాసులు | వీఆర్, కడప | దిశ, పీఎస్ |
| ఏ.ఎస్.ఎన్.కుమార్ | వీఆర్, కడప | డీసిఆర్‌బి, కడప |
| టి. సంజీవరెడ్డి | వీఆర్, కడప | డీసిఆర్‌బి, కడప |
| కె. మరియన్న | వీఆర్, కడప | డీటీసి, కడప |
| పి. ప్రతాప్‌రెడ్డి | వీఆర్, కడప | కడప ట్రాఫిక్ పీఎస్ |
| కె. సుబ్రమణ్యం | వీఆర్, కడప | కడప ట్రాఫిక్ పీఎస్ |
| ఎస్. అనసూయ | వీఆర్, కడప | దిశ పీఎస్ |
| ఆర్. రాఘవేంద్రారెడ్డి | ఇటుకల పల్లి పీఎస్ (అనంతపురం జిల్లా) | ప్రొద్దుటూరు టూటౌన్ పీఎస్ |
| యు. ప్రతాప్‌రెడ్డి | చౌడేపల్లి పీఎస్ (చిత్తూరు జిల్లా) | కమలాపురం పీఎస్ |



## బెనీషా డీలా..
# పునాసా భళా

ప్రపంచ దేశాలలో వీరబల్లె మామిడికి మంచి క్రేజ్ ఉంది. బేనీషా(బంగినపల్లి)గా పిలిచే ఈ రకం మామిడి పండ్లకు తాజాగా డిమాండ్ కాస్త తగ్గి రైతు దీలా పడుతున్నాడు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నా ఆదాయం లేకపోవడంతో.. పునాసా, రుమాణి రకాలపై మొగ్గు చూపుతున్నారు. రెండున్నరేళ్లకు దిగుబడులు రావడంతో భళా అనిపిస్తున్నారు.

- కొత్త రకం మామిడి మొక్కలు నాటేందుకు సాగుకు రైతుల ఆసక్తి
- అన్నమయ్య జిల్లాలో 300 ఎకరాల్లో తోటల సాగు
- మొక్క నాటిన రెండేళ్లకే మామిడి దిగుబడులు



వేరుశనగ పొలంలో విరగకాసిన పునాసా రకం మామిడి కాయలు



విరగకాసిన రుమాణి రకం మామిడి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలోనే అధికంగా పండే పంట మామిడి. రాయచోటి, గాలివీడు, చిన్నమండ్యం, మదనపల్లె. ఆర్.కోడూరు ప్రాంతాల్లో దాదాపు 60 వేల ఎకరాలకు పైగా మామిడి సాగు చేస్తారు. వీటిలో వీరబల్లె మండలంలో పండే మామిడికి విపరీతమైన డిమాండ్ ఉంది. అయితే ఇటీవల క్రిమిసంహారక మందులు వాడుతున్నారని, మందులు పెట్టి పక్వం చెందిస్తున్నారనే ప్రచారంతో ఈ మామిడికి కాస్త ఆదాయం తగ్గింది. అయినా రైతుకు మామిడిపై మమకారం తీరకపోవడంతో.. అధికారుల సలహాలతో శాస్త్రీయంగా ఆలోచించి.. మార్కెట్లో డిమాండ్ ఉన్న మామిడి తోటల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. బహుళ ప్రయోజనాల తోపాటు ఏడాదంతా కాపు కాసే వెరైటీల వైపు మొగ్గు చూపుతున్నారు.

**పునాసా, రుమాణి రకాలకు డిమాండ్**

రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న మామిడి రకాలు పునాసా, రుమాణి. వాటిలో పునాసా మామిడి రకాలను రాయలసీమ స్పెషల్‌గా పిలుస్తారు. ఈ ఏడాది జిల్లాలో 300 ఎకరాలకు పైగా ఈ రకం మామిడి సాగు చేశారు. ఏడాది పొడవునా పునాసా రకం మామిడి తోటల్లో ఏడాదికి రెండు సార్లు కచ్చితంగా కాయల దిగుబడి వస్తుంది. సీజనల్‌గా జనవరిలో పూత వచ్చి మార్చి-ఏప్రిల్ నెలలో దిగుబడి పూర్తవుతుంది. వెంటనే మే ఆఖరు నుంచి మళ్లీ కాయలు కాస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ రకం మామిడి కాయలు(పండ్లు) మార్కెట్‌లోకి వచ్చాయి. వినియోగదాలు నేరుగా తోటల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. తొలి కాపులోనే (రెండున్నర సంవత్సరాల వయసు మొక్కలు) ఎకరానికి రూ.30 వేలకు తగ్గకుండా దిగుబడి వస్తోందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండేళ్లు దాటితే ఎకరాకు కనీసం రూ.50 వేలు తగ్గకుండా వస్తుందని రైతులు చెబుతున్నారు.

### కొత్త రకాలపై రైతులు మొగ్గుచూపుతున్నారు

కొత్త రకాలపై ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. రెండేళ్లుగా ప్రత్యామ్నాయ మామిడి పంట సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 300 ఎకరాల కన్నా ఎక్కువగా సాగవుతోంది. దిగుబడి పొందిన రైతులు ఆదాయం గడిస్తున్నారు. ధర లేకపోయినా జులై-ఆగస్టులో వచ్చే దిగుబడికి మంచి డిమాండ్ ఉంది. మూడున్నర సంవత్సరాల తర్వాత ఎకరాకు కనీసం 2-3 టన్నులు దిగుబడి వస్తుంది. అప్పటి ధరల ఆధారంగా ఎకరాకు రూ.50 వేలు లాభం తప్పనిసరి.

– రవిచంద్రబాబు, ఉద్యాన శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

### నాలుగు ఎకరాల్లో సాగు చేశాను



నాకు ఉన్న పొలంలో తొలిసారిగా రెండు ఎకరాల్లో ఈ పునాసా రకంతోపాటు రుమాణి రకం సాగు చేశాను. మళ్లీ సంవత్సరం తర్వాత మరో రెండు ఎకరాల్లో పంట సాగు చేశాను. మొదటి తోటలోని మొక్కలకు ప్రస్తుత వయస్సు రెండున్నర సంవత్సరమే. గత 15 రోజులుగా పునాసా కాయలు ఊర గాయ పచ్చళ్ల కోసం వినియోగదారులు కిలో రూ.50తో కొంటున్నారు. ఇప్పటికే సుమారు 500 కిలోలు విక్రయించాను. ఇంకా 500 కిలోల వరకు ఉండొచ్చు. సేంద్రీయ పద్ధతిలో సాగుచేస్తున్నా. ఈ ఏడాది నాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు లాభం వస్తుంది.

– తాతయ్య, రైతు, రాయచోటి

### 50మందిపై విద్యుత్తు చోరీ కేసులు

కడప కార్పొరేషన్ : కడప రూరల్, పులివెందుల రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్తు శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 50 మంది ఇళ్లు, దుకాణయజమానులపై కేసులు నమోదు చేసి రూ.3లక్షల జరిమానా విధించారు.

### నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రేమించమని యువతిని వేధించిన కేసులో ఓ వ్యక్తి మూడేళ్ల జైలుశిక్ష పడింది. 2019లో రామేశ్వరానికి చెందిన అవివాహితను అదే వీధికి చెందిన పొట్టి పాటి శ్యామ్ అలియాస్ కిరణ్ ప్రేమించమని వెంటపడి వేధించేవాడు. యువతి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నారాయణ యాదవ్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శుక్రవారం నిందితుడు పొట్టి పాటి శ్యామ్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.8వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

### ఆటోలు చోరీ చేసే దొంగ అరెస్టు

కడప అర్బన్ : కడప నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిల్లో ఆటోలను దొంగతనం చేసిన అన్నమయ్య జిల్లా రామాపురం మండలం దూదేకుల పల్లి చెందిన పాలగిరి మహమ్మద్ రఫీని కడప వన్ టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ. 5.50 లక్షల విలువైన నాలుగు ఆటోలను సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ భాస్కర్‌రెడ్డిని, కానిస్టేబుళ్ల కిరణ్‌కుమార్‌ను ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

### 15న హర్ ఘర్ తిరంగా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 15వ తేదీన చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే కాపురామ చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూడాలన్నారు. 11, 12 13వ తేదీలలో బైక్ ర్యాలీ, 14న మౌన ప్రదర్శన ఉంటాయన్నారు.

## దళిత మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కడప కార్పొరేషన్ : బద్వేల్ మండలం సి.కొత్తపల్లె గ్రామంలో దళిత మహిళపై దాడి చేసిన అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని దళిత ఫోరం జిల్లా చైర్మెన్ కిషోర్ బూసిపాటి డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీకి చెందిన రామచంద్రారెడ్డి తన అనుచరులతో ఆ స్థలం వద్దకు వెళ్లి అసభ్యకరంగా దూషిస్తూ గుడిసెలు కూల్చివేశారన్నారు. మహిళలని చూడకుండా ఇష్టానుసారంగా ఈ ప్రభుత్వం మాదిరా.. అంటూ తీవ్రస్థాయిలో బెదిరించారన్నారు. అడ్డువచ్చిన దళిత మహిళపై దాడి చేసి పిడిగుద్దులు గుద్దారని, జడ పట్టుకొని ఈడ్చి వేశారన్నారు. హోంమంత్రి జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత ఫోరం నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా రైల్వే స్టేషన్‌లో పనులు కొనసాగించాలని గుంతకల్లు డీఆర్ఎం విజయ్‌కుమార్ ఆదేశించారు. కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ స్టేషన్ పనులను గురువారం ఆయన అకస్మికంగా పరిశీలించారు. డిప్యూటీ స్టేషన్ మాస్టర్ కార్యాలయంలోని సిగ్నలింగ్ వ్యవస్థను తనిఖీ చేశారు. రైల్వేలో సిగ్నలింగ్ వ్యవస్థ అత్యంత కీలకమైనదని, అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కడప రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కడ వస్తాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఆర్ఎం వెంట సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఎస్ఓ సూర్యనారాయణ, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఈఎన్ మణికంఠ, జనార్దన్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, ఏడీఈఎన్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లు వెనక్కు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని కోరుతూ స్థానిక శివాలయం సర్కిల్‌లో ఎంపీజే ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌సలీం మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం భూ యాజమాన్య హక్కులను హరించేందుకు, ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేందుకు, వక్ఫ్ ఆస్తులను కాజేయడానికి ఏకంగా 44 సవరణలు చేసి బిల్లును పార్లమెంటులో ఆమోదించేలా కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, జాకీర్ ఉమ్రి, హుస్సేన్‌బాషా, కార్యదర్శి మహ్మద్‌రఫీ, అస్లాం పాల్గొన్నారు.

### ప్రధానోపాధ్యాయురాలు మృతి

కొండాపురం : మండలంలోని టి.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత గురువారం మృతి చెందారు. వారం రోజుల క్రితం ఆమె పాఠశాలకు స్కూటీపై వస్తూ ఇసుకలో జారిపడ్డారు. కడప ఫ్రైమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గతంలో ఆమె కొండాపురం జెడ్పీ ఉన్నతపాఠశాలలో గణిత ఉపధ్యాయురాలిగా పనిచేసింది. ప్రధానోపాధ్యాయురాలు అకాల మరణం పట్ల ఎంఈఓ ఓబులేసు, రామయ్యలు విచారం వ్యక్తం చేశారు.